## ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 6: జిల్లా కేంద్రంలోని సాయికుంట గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఫుడ్ పాయిజన్‌తో 12 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ వెంటనే పాఠశాలకు వెళ్లి తనిఖీ చేశారు. వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించి మిగతా విద్యార్థులకు పరీక్షలు చేయించారు. వంటగదిలో భోజనం, ఆహార పదార్థాలను, నీటిని పరిశీలించారు. నమూనాలను సేకరించి ఫుడ్ సెక్యూరిటీ అధికారులకు పంపిస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్య సేవలందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట ఆర్ఎంవో శ్రీధర్, వైద్యులు అనిత, అశోక్, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

సిర్పూర్(టీ), నవంబర్ 6 : పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం సిర్పూర్(టీ) పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల ఫైళ్లను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని, నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి, తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటల సీఐ రమేశ్, సిర్పూర్(టీ) ఎస్‌ఐ కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


---

*నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) మైనార్టీ గురుకుల విద్యార్థి అర్బస్ మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అప్పస్ అనే విద్యార్థి దాడి చేయడంతో ఆ విద్యార్థి మృతి చెందాడు. గురుకులంలో విద్యార్థులు గొడవ పడేది. కొట్టుకునేది అధికారులకు తెలియలేదా? వారి నిర్లక్ష్యంతోనే అర్బస్ మృతి చెందాడనే ఆరోపణలున్నాయి. - ఈ ఘటన ఫిబ్రవరి 8, 2024లో జరిగింది.*



వాంకిడి దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

*కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఈ ఘటనలో 75 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం చౌదరి శైలజ అనే విద్యార్థిని వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య పోరాడుతున్నది. - అక్టోబర్ 31, 2024న జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.*



ఆసిఫాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

# గాడి తప్పుతున్న గురుకులాలు

## అదేబాటలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు

*ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే మడావి గంగోత్రి(14) వాంతులు, విరేచనాలు చేసుకుని మృతి చెందింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చూపించి వైద్యుల సూచనల మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. కాగా.. గంగోత్రి పాఠశాల బాత్‌రూమ్‌లోనే స్పృహతప్పి పడిపోయి చనిపోయిందని.. పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోతే ఆమె మృతి చెందేది కాదంటూ వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు. - ఈ ఘటన అక్టోబర్ 26, 2024న జరిగింది.*



మడావి గంగోత్రి (ఫైల్)

- ఫుడ్ పాయిజన్ ఘటనలతో బెంబేలెత్తిపోతున్న తల్లిదండ్రులు
- వాంకిడి ఘటన మరవక ముందే మంచిర్యాలలో ఫుడ్ పాయిజన్
- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం
- ఉమ్మడి జిల్లాలో ఈ యేడాది ముగ్గురు విద్యార్థుల మృతి

### బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి..

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైన హెచ్‌ఎంతోపాటు వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలి. పాఠశాల పర్యవేక్షణలో విఫలమైన ఏటీడీవో, డీటీడీవోలపైనా చర్యలు తీసుకోవాలి. వరుస ఘటనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలుండాలి. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం.

*-డి.శ్రీకాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు.*

### నిర్లక్ష్యాన్ని ఉపేక్షించొద్దు..



గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవ హరించిన ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలి. ఎవరినీ ఉపేక్షించొద్దు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు తీసుకొచ్చిన గురుకులాలను దెబ్బతీయాలనే కుట్రతోనే కాంగ్రెస్ సర్కారు వాటిని పట్టించుకోవడం లేదు. హరీశ్‌రావు వెళ్లి పరామర్శించే వరకు వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు భరోసా ఇచ్చే దిక్కు లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి, విధులను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలి. గురుకులాలను, ఆశ్రమ పాఠశాలలను బలోపేతం చేయాలి.

*- శ్రావణ్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల.*

మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలపై సర్కారు పర్యవేక్షణ కొరవడింది. రేవంత్ సర్కారు వచ్చిన 11 నెలల్లోనే ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువే విద్యార్థులు ముగ్గురు మృతి చెందారు. నిన్న(మంగళవారం) నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే(ఎంజేపీ)లో తొమ్మిదో తరగతి విద్యార్థి షేక్ అయాన్ హుస్సేన్ పిట్స్ రావడంతో మృతిచెందాడు. వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విష ఆహారం తిని అస్వస్థతకు గురైన చౌదరి శైలజ సీరియస్ కండీషన్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విష ఆహారం ఘటనను మర్చిపోకముందే బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. ఉదయం పెట్టిన కిచిడీ తిన్న పదో తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థినులు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. ఇలా.. ఉమ్మడి జిల్లాలో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలు తల్లిదండ్రుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. చదువుకోవడం కోసమని ఇల్లు విడిచి హాస్టళ్లకు వెళ్లిన తమ పిల్లలు ఏమైపోతారో అనే ఆందోళనలో తల్లిదండ్రులు కొట్టుమిట్టాడుతున్నారు.

### కరువైన పర్యవేక్షణ..

గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అధికారులు రెగ్యూలర్ తనిఖీలు నిర్వహించకపోవడంతో ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీయగా.. ప్రిన్సిపాల్ మాధవ్ ముందస్తు పర్మిషన్ తీసుకోకుండా సెలవు తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై సీరియస్ అయిన ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆయనను సస్పెండ్ చేశారు. పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, వార్డెన్‌లకు విధుల విషయంలో ఎంత చిత్తశుద్ధితో ఉంటున్నారో.. పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందనేది ఈ ఘటనతోనే తెలిసిపోతుంది. ఉన్నతాధికారులకు తెలియకుండా పాఠశాల ప్రిన్సిపాల్ అనధికారిక లీవ్‌లో వెళ్లడం ఏంటి.. ఇది ఈ ఒక్క పాఠశాలలో జరుగుతుందా లేకపోతే గిరిజన ఆశ్రమ పాఠశాలల అన్నింటిలో జరుగుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. అన్ని పాఠశాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విధులను నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

### ఫుడ్ శాంపిల్స్ పరీక్షలకు పంపాం..

మంచిర్యాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 12 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ హుటాహుటిన మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి విద్యార్థినులు, వైద్యులతో మాట్లాడారు. అస్వస్థతకు గురైన అందరూ పదో తరగతి విద్యార్థినులని, అంతా స్నేహితులని చెప్పారు. బయటి నుంచి ఏదైనా తీసుకొచ్చి తిన్నారా అంటే తినలేదనే చెప్పారని.. కాకపోతే విద్యార్థులు తిన్న ఆహారం ఫుడ్ శాంపిల్స్‌తోపాటు పాఠశాలలోని తాగునీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు పంపించామన్నారు. ఆ ఫలితాలు వచ్చాక ఎవరైనా తప్పు చేసినట్లు తేలిసే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగలకు ఇంటికి వెళ్లి వచ్చిన విద్యార్థినులు బయటి నుంచి ఏదైనా ఫుడ్ తీసుకువచ్చారా చెక్ చేయాలని వార్డెన్‌లను ఆదేశించామన్నారు. ప్రత్యేక వైద్య సిబ్బందితో పిల్లలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఇదే విషయంపై ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్తా స్పందిస్తూ.. ఇంటి నుంచి తెచ్చిన పచ్చడి కిచిడీలో కలుపుకుని తినడంతో ఇబ్బంది వచ్చిందని చెప్పారు. పిల్లలు తిన్న ఆహారంతోపాటు ఆ పచ్చడి శాంపిల్స్‌ను టెస్టులకు పంపామన్నారు. ఫలితాలు వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులు మాత్రం ఉడకని లూస్‌గా ఉన్న కిచిడీతోపాటు చింత పులుసు పెట్టారని తెలిపారు. హాస్టల్‌లో వండే ఆహారం పూర్తిగా ఉడకకుండానే పెడుతున్నారని, రోజూ ఇదే పరిస్థితి ఉందని వాపోయారు. మరీ ఈ వ్యవహారంపై అధికారులు ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాలి.




వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల



మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు



విద్యార్థినులు, డాక్టర్లతో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

---

## విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- మంచిర్యాలలోని మ్యాక్స్ కేర్ దవాఖానలో విద్యార్థినులకు పరామర్శ



దవాఖానలో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

వాంకిడి, నవంబర్ 6: వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. మంగళవారం రాత్రి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మ్యాక్స్ కేర్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఇక్కడి నుంచి ముగ్గురు విద్యార్థులను హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అక్కడున్న తల్లిదండ్రులు, బంధువులకు తెలిపారు.



ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి

## విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి**

వాంకిడి, నవంబర్ 6: ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, నిత్యం అధికారులు తనిఖీలు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి సూచించారు. బుధవారం వాంకిడిలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయితో కలిసి సందర్శించారు. పరిసరాలతో పాటు వంటగది, సీజ్ చేసిన సరుకులను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలల నిత్యం పర్యవేక్షించాలని జీసీడీవో శకుంతలకు సూచించారు. అనంతరం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.

## సర్వేను సకాలంలో పూర్తి చేయాలి


జైపూర్, నవంబర్ 6: ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం మండలంలోని ఇందారం, మిట్టపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ రికార్డులు, అధికారుల హాజరుశాతాన్ని పరిశీలించారు. వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి అన్ని గ్రామాల్లో హౌస్ లిస్టింగ్ పూర్తయినందున సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం సర్వే సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామాల్లోని వైద్య సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. మండల పరిషత్, యూపీఎస్ పాఠశాలలను సందర్శించారు. ఆదర్శ పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కంపోస్టు షెడ్, నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని సందర్శించారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తిచేయాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలను కాపాడాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇందారంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైంది

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి 200 మంది చేరిక



బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 6 : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని రెండవ వార్డులో వివిధ పార్టీల నుంచి సుమారు 200 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి దుర్గం చిన్నయ్య ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై విసుగుచెంది పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ చేరికలు ఆరంభం మాత్రమేనని ఇవి నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలు మళ్లీ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని ఆయన వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, నాయకులు అరుణ్, శ్రీనివాస్, అలీ, గోపి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సింగరేణి స్థాయి ఫుట్‌బాల్ పోటీల విజేత శ్రీరాంపూర్ జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్

మందమర్రి, నవంబర్ 6: మందమర్రిలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏరియా జీఎం జీ.దేవేందర్ నేతృత్వంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సింగరేణి స్థాయి ఫుట్‌బాల్ పోటీలో విజేతగా శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయం సాధించింది. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీరాంపూర్ జట్టుకు ప్రథమ, రన్నర్‌గా నిలిచిన జీడీకే 1,2కు ద్వితీయ బహుమతులను మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ అందజేశారు. పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసిన క్రీడల గౌరవ కార్యదర్శి, కో ఆర్డినేటర్, ఆర్గనైజర్లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ అలీ, దాగం మల్లేశ్, సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ కార్పొరేట్ పాస్నేట్, సూపర్ వైజర్‌లు జాన్‌వెస్లీ, అశోక్, రమేశ్, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ క్యాప్టెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.